# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 06-08-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- రాష్ట్ర మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.
- నేతన్నలకు మూడు నూతన పథకాలను రేపు జరగనున్న 11వ జాతీయ చేనేత దినోత్సవంలో ప్రారంభించనున్నామని మంత్రి ఎస్.సవిత తెలిపారు.
- రాష్ట్రంలోని యువతకు 20 లక్షల ఉద్యోగ, ఉపాధి కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు.
- అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా ఆగస్టు 12న రామచంద్రాపురంలో “కోనసీమ యూత్ సమ్మిట్” జరగనుంది.
- రానున్న మూడు రోజుల పాటూ రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం వెల్లడించింది.

==========================

రాష్ట్ర మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఈనెల 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించనుంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఈరోజు రాష్ట్ర సచివాలయంలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో దీనికి ఆమోదం లభించింది. అదే విధంగా నూతన బార్ పాలసీని కూడా మంత్రివర్గం ఆమోదించింది. ఈ నూతన విధానం ప్రకారం కల్లుగీత కార్మికులకు 10 శాతం మద్యం షాపులను కేటాయించనున్నారు. జిల్లాల పునర్విభజనలో లోపాలు, సరిహద్దు సమస్యలపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం జిల్లాల పేరు మార్పులు, నియోజకవర్గాల విలీన ప్రక్రియ ప్రతిపాదనలపై నెల రోజుల్లోగా నివేదికలు ఇవ్వాలని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ఆదేశించారు. ఈ మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను రాష్ట్ర సమాచార ప్రజా సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారథి పాత్రికేయులకు వెల్లడిస్తూ…

(వాయిస్ 39 సెకన్లు)

==========================

గుంటూర్ జిల్లా మంగళగిరిలో రేపు 11వ జాతీయ చేనేత దినోత్సవాన్ని నిర్వహించనున్నామని రాష్ట్ర చేనేత, జౌళి శాఖా మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరవుతారని జౌళి శాఖా మంత్రి కార్యాలయం ఈరోజు ఒక ప్రకటన విడుదల చేసింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు నేతన్నలకు ఉచిత విద్యుత్ అందించడంతో పాటూ జీఎస్టీ అమలు, త్రిఫ్ట్ నిధులను మంజూరు చేసేందుకు కట్టుబడి ఉన్నామని మంత్రి సవిత ఆ ప్రకటనలో పేర్కొన్నారు. అదే విదంగా రేపు చేనేతకు సంబందించి మూడు పథకాలను ప్రారంబించనున్నామని మంత్రి తెలియజేశారు.

==========================

హరిత ఇంధన శక్తిలో అపార ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని రాష్ట్ర ఐటీ విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆద్వర్యంలో విజయవాడలో నిర్వహించిన గ్రీన్ ఎనర్జీ కాన్ఫరెన్స్ లో ఈరోజు ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ ప్రసంగిస్తూ రాష్ట్రాన్ని హరితాంధ్రప్రదేశ్ గా మార్చాలన్నది ముఖ్యమంత్రి ధ్యేయమని తెలిపారు. ఈ రంగంలో యువతకు ఉద్యోగాలను కల్పించేందుకు కృషి చేస్తున్నామని వెల్లడించారు. 20 లక్షల ఉద్యోగ, ఉపాధి కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి నారా లోకేశ్ వివరిస్తూ...

(వాయిస్ 33 సెకన్లు)

==========================

రాష్ట్ర రవాణా శాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డితో జాతీయ రహదారి ప్రాధికార సంస్థ (NHAI) చైర్మన్ ఆర్.కె. సింగ్, రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే ఈరోజు అమరావతిలోని సచివాలయంలో సమావేశమయ్యారు. రాయచోటి, మదనపల్లి మధ్య రహదారిపై ప్రమాదాల నివారణకు సంబంధించి ఈ సందర్బంగా చర్చించారు. రాయచోటి – మదనపల్లి మధ్య ప్రయాణం చేసే వాహనదారుల భద్రత దృష్ట్యా ప్రస్తుత ప్రణాళికలో ఉన్న అండర్ పాస్ స్థానంలో ట్రాఫిక్ ఐలాండ్ ఏర్పాటు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ప్రమాదాలను తగ్గించడంలో ట్రాఫిక్ ఐలాండ్‌లు కీలకంగా ఉంటాయని పేర్కొంటూ... అవసరమైన మార్పులు వెంటనే చేపట్టాలని సూచించారు.

విరామం

==========================

అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్బంగా ఆగస్టు 12న రాష్ట కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆధ్వర్యంలో రామచంద్రాపురంలో జరగనున్న “కోనసీమ యూత్ సమ్మిట్” గోడపత్రికను రాష్ట్ర ఐటీ విద్యా శాఖల మంత్రి నారా లోకేష్ ఈరోజు ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్బంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... యువతలో దాగి ఉన్న ప్రతిభను, నైపుణ్యాన్ని రాష్ట్ర భవిష్యత్ అవసరాల కోసం వినియోగించుకునేందుకు కోనసీమ యూత్ సమ్మిట్ వంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. అభివృద్ధి అజెండాగా భవిష్యత్ ప్రణాళికలు చర్చించడంతో పాటు, యువతలోని నాయకత్వ లక్షణాలు, పరిస్థితులకు తగినట్లు వేగంగా నిర్ణయాలు తీసుకునే ఆలోచన విధానాలను యూత్ సమ్మిట్ వంటి కార్యక్రమాల ద్వారా యువత అలవర్చుకోవాలని ఆయన సూచించారు.

==========================

బాలల హక్కులను పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ అంకితభావంతో కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బి పద్మావతి అధికారులకు సూచించారు. కృష్ణా జిల్లా కలెక్టరేట్ లో బాలల హక్కుల పరిరక్షణ, బాల్య వివాహాల నిషేధం, పిల్లల కోసం ఉద్దేశించిన చట్టాల అమలు తీరుపై సంబంధిత శాఖల అధికారులతో ఈరోజు ఆమె సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్బంగా మాట్లాడుతూ... బాలల హక్కుల పరిరక్షణ కమిషన్

తో పాటు అన్ని శాఖలు సమన్వయంతో బాలల కోసం ఏర్పాటు చేసిన చట్టాలను సక్రమంగా అమలు చేయాలన్నారు. జిల్లాలోని అన్ని రెసిడెన్షియల్, వసతి గృహాల్లో జాతీయ బాలల హక్కుల కమిషన్ వారి సూచనలు తప్పక పాటించాలన్నారు. సమాజంలో బాల్యవివాహాలు అడ్డుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, టీనేజ్ ప్రెగ్నెన్సీపై దృష్టి సారించి జిల్లాలో వీటి నియంత్రణకు కృషి చేయాలని సూచించారు.

==========================

స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని దేశవ్యాప్తంగా ఐక్యతా భావనను పెంపొందించేందుకు "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమాన్ని ఈ నెల 15వ తేదీ వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్నాయి. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో ప్రతీ ఒక్కరూ పాల్గొని  తమ తమ ఇళ్ళపై త్రివర్ణ పతాకాన్ని ఎగుర వేయాలని ప్రభుత్వం పిలుపునిచ్చింది. అదే విదంగా తిరంగా రంగోలీ, తిరంగా బైక్ ర్యాలీ, తిరంగా రాఖీ తయారీ వంటి కార్యక్రమాల్లో భాగమవ్వాలని కోరింది. భారత జాతి గర్వాన్ని ప్రకాశించే జాతీయ పతాకంతో తీసుకున్న సెల్ఫీ చిత్రాల ఆనందాన్ని www.harghartiranga.com లో పంచుకోవాలని సూచించింది.

==========================

వైజ్ఞానిక ప్రపంచం లో విద్యార్థులు జ్ఞాన సముపార్జనకు ఆసక్తి చూపాలని చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. చిత్తూరులోని స్థానిక కళాశాలలో ఈరోజు నిర్వహించిన జాతీయ అంతరిక్ష దినోత్సవంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023 లో భారత్ చేపట్టిన చంద్రయాన్ -3 విజయవంతమైన సందర్భంగా జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు. ప్రపంచం సాంకేతికమయం అయిందని, వైజ్ఞానిక ప్రపంచంలో ఇమడాలంటే విద్యార్థులు తరగతి గదులలో విద్యతో పాటు అదనపు జ్ఞానాన్ని కూడా సంపాదించుకోవాలన్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం నేషనల్ అటామిక్ రీసెర్చ్ లాబొరేటరీ సహకారంతో విద్యార్థులకు త్వరలో 50 రోజుల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని తెలిపారు.

==========================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా రెండవ రోజు కూడా నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్  ఈ ఉదయం 80,710 పాయింట్ల వద్ద నష్టాల్లో ప్రారంభమై... చివరికి 166 పాయింట్ల నష్టంతో 80,544 వద్ద ముగిసింది. నిఫ్టీ 75 పాయింట్ల నష్టంతో 24,574 వద్ద స్థిరపడింది.

==========================

నైరుతి బంగాళాఖాతంలో ఉత్తర తమిళనాడు తీరంతో పాటుగా రాయలసీమ పరిసర ప్రాంతాల్లో వేర్వేరు ఉపరితల ఆవర్తనాలు కొనసాగుతున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. వీటి ప్రభావంతో  రానున్న మూడు రోజుల పాటూ రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం అధికారి ఎం.వెంకట్రావు వెల్లడిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

==========================

==========================